20-07-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - శివబాబా చిత్రాన్ని ఒక చిన్న గదిలో పెట్టండి, ఘుడియ-ఘుడియా వెళ్ళి వారి ముందు కూర్చొని మాట్లాడుతూ ఉండండి, తద్వారా రోజంతా స్మృతి నిలిచి ఉంటుంది"

ప్రశ్న:- కేవలం సంగమయుగములోనే అనుభూతి అయ్యే అద్భుతమైన మరియు కొత్త ప్రేమ ఏమిటి?

జవాబు:- విచిత్రుడైన తండ్రిని ప్రేమించడము, ఇది కొత్త ప్రేమ. మీకు తెలుసు - నిరాకారుడైన, విచిత్రుడైన బాబా ఈ సాకారునిలోకి వచ్చారు, మనం వారి ఎదురుగా కూర్చున్నాము, మనకు సంగమములో డైరెక్ట్ ఈశ్వరుని ప్రేమ లభిస్తుంది, ఇది అద్భుతమైన మరియు కొత్త ప్రేమ. మొత్తం కల్పమంతా దేహధారులను ప్రేమించారు, ఇప్పుడు విదేహీ తండ్రిని ప్రేమించాలి. ఇటువంటి ప్రేమ సంగమములోనే ఉంటుంది.

పాట:- నా మనస్సు అనే ద్వారము వద్దకు ఎవరు వచ్చారు... (కౌన్ ఆయా మేరే మన్ కే ద్వారే...)

ఓం శాంతి. పిల్లలకు తెలుసు - అనంతమైన తండ్రి విచిత్రులు మరియు ఇప్పుడు మనం కొత్త ప్రేమతో తండ్రి వద్దకు వచ్చాము మరియు కూర్చున్నాము. దీనిని కొత్త ప్రేమ అని అంటారు. ఈశ్వరుని ప్రేమ పిల్లలకు కేవలం ఒక్క సారే లభిస్తుంది. తప్పకుండా పరమపిత పరమాత్మను మనమందరమూ స్మృతి చేస్తామని పిల్లలు అర్థం చేసుకోగలరు. వారు కూర్చొని పిల్లలను చదివిస్తారు. ఆ నిరాకార, విచిత్రులైన బాబా వీరిలోకి వచ్చారు. పరమపిత పరమాత్మ ఆత్మలైన మన తండ్రి. ఇప్పుడు మనం వారిని తెలుసుకున్నాము, గుర్తించాము. ఈ ప్రేమ కూడా అద్భుతమైనది. మామూలుగా అయితే ఎప్పుడూ దేహధారినే ప్రేమించడం జరుగుతుంది. వీరు విదేహీ, దేహము లేనివారు. మనం వారి ఎదురుగా కూర్చున్నాము. వారు ఎంతో ప్రేమగా వచ్చి చదివిస్తారు. కావున ఇది కొత్త విషయం కదా. ఇంతకుముందు ధనము లభించాలి, మహళ్ళు లభించాలి అన్న ఆశలు ఏవైతే ఉండేవో, ఆ ఆశలన్నీ ఇప్పుడు మారిపోయాయి. మొత్తం ప్రపంచములో ఉన్న ఆశలతో పోలిస్తే మీ ఆశ మారిపోయింది. మనం ఇప్పుడు బాబా ద్వారా విశ్వాధిపతులుగా అయ్యే పురుషార్థము చేస్తున్నాము. ఇప్పుడు మీరు సమ్ముఖముగా కూర్చున్నారు. వారే సర్వ ఆత్మలకు తండ్రి, పతిత-పావనుడైన శివుడు అని మీకు తెలుసు. స్మృతి కూడా వారినే చేస్తారు. ఇప్పుడు పిల్లలైన మీరు సమ్ముఖముగా కూర్చున్నారు. అనంతమైన తండ్రి నుండి అనంతమైన వారసత్వాన్ని తీసుకోవాలి అని మీ హృదయములో ఉత్సాహము ఉంది. వీరు ఎంత విచిత్రులైన, సాటిలేని, అద్భుతమైన తండ్రి! ఇది ఇంకెవ్వరికీ తెలియదు. తండ్రి ఏ విధంగా తమ వారిగా చేసుకొని ఆ తర్వాత చదివిస్తారు అనేది కేవలం మీకు మాత్రమే తెలుసు. మరి ఘుడియ-ఘుడియ తండ్రిని స్మృతి చేస్తూ ఉండేందుకు ఏ యుక్తిని రచించాలి? ప్రతి ఒక్కరూ తమ ఇంట్లో శివుని చిత్రాన్ని పెట్టుకోండి అని తండ్రి సలహా ఇస్తారు. శివబాబా చిత్రాన్ని చూసి - పతితపావనుడైన అనంతమైన తండ్రి పావన ప్రపంచాన్ని స్థాపన చేయడానికి వచ్చారు అని అర్థం చేసుకుంటారు. వారి ద్వారా మనం ఇప్పుడు 5,000 సంవత్సరాల క్రితం వలె స్వర్గ స్వరాజ్యపు వారసత్వాన్ని తీసుకుంటున్నాము. మేము స్వర్గములోకి వెళ్ళి శరీరముతోపాటు రాజ్యం చేస్తాము - అని ఆత్మకు తెలుసు. ఈ విషయము ఎప్పుడూ స్వప్నములో కూడా ఉండేది కాదు. ఇప్పుడు వారు వచ్చారు కావున మీ గది ఒకటి తయారుచేసుకొని శివుని చిత్రాన్ని పెట్టి దానిపై - బాబా వచ్చి ఉన్నారు అని వ్రాయండి. స్వర్గ స్థాపన చేయడానికి, నరకవాసులను స్వర్గవాసులుగా తయారుచేయడానికి వారు రావలసిందే. ఘుడియ-ఘుడియ శివబాబాను చూస్తూ ఉన్నట్లయితే స్మృతి నిలుస్తుంది. చిత్రాన్ని మెడలో కూడా వేసుకుంటారు. పతి చిత్రాన్ని కూడా మెడలో వేసుకుంటారు కదా. పిల్లలైన మీ కొరకు కూడా తయారుచేయిస్తున్నారు. పారలౌకిక తండ్రిని స్మృతి చేయడం చాలా అద్భుతము. ఇతరులందరి స్మృతిని సమాప్తం చేసి ఒక్కరినే స్మృతి చేయాలి. ఏ విధంగా భక్తి మార్గంలో కూడా తమ ఇంట్లో చిన్న పూజా గదిని లేక మందిరాన్ని తయారుచేసుకుంటారు కదా, అలాగే జ్ఞాన మార్గంలో కూడా ఒక చిన్న గదిని తయారుచేసి అందులో కేవలం శివబాబా చిత్రాన్ని పెట్టాలి. బ్రహ్మాకుమారీల మురళి వికారాల నుండి విడిపిస్తుంది అని మనుష్యులు భావిస్తారు. అరే, ఇది మంచిదే కదా. పావనులుగా అవ్వడానికి తప్పకుండా వికారాలను విడిచిపెట్టవలసి ఉంటుంది. భక్తిని ఎందుకు వదులుతారు? అని కోప్పడతారు. అచ్ఛా, మేము భక్తి చేస్తాము కానీ ఒక్కరిదే, ఇంకెవ్వరిదీ చేయము. ఇతర సాంగత్యాల నుండి బుద్ధియోగాన్ని తెంచి వేయాలి.

మీ యుద్ధము మాయతో ఉంది. మీరు తండ్రిని స్మృతి చేస్తారు, మాయ తెంచేందుకు ప్రయత్నిస్తుంది. మాకు శివబాబా నుండి వారసత్వము లభిస్తుంది - అని స్మృతి చేస్తూ ఉంటారు. శివబాబాను చూస్తూ ఉన్నట్లయితే మీ చిన్న గది

వైకుంఠముగా అయిపోతుంది. మీరా కూడా భక్తి చేసేటప్పుడు వైకుంఠ సాక్షాత్కారాన్ని పొందేవారు. ఆమెకు కూడా సాక్షాత్కారము చేయించేవారు శివబాబాయే. మేము శివబాబా ద్వారా విశ్వాధిపతులుగా అవుతాము అని మీ బుద్ధిలోకి ఇప్పుడు వచ్చింది. శివుడు ఏమి చేస్తారు, వారిపై ఎందుకు బలిహారమవుతారు అనేది భక్తి మార్గంలో తెలియదు. అందరికన్నా ఉన్నతమైనవారు శివబాబా అని, వారినే పరమాత్మ అని అంటారని మీరు అర్థం చేసుకుంటారు. పరమాత్మ నుండి తప్పకుండా కొత్త వస్తువు లభిస్తుంది. వారిని స్వర్గ స్థాపకుడైన తండ్రి అని అంటారు. స్వర్గములో శ్రీకృష్ణుడు ఉన్నారు, వారిని తండ్రి అని అనరు. వారు చిన్న బాలుడు. స్వర్గ స్థాపన చేసేది నిరాకారుడైన తండ్రి, వారు దేహధారి కాదు. నిజానికి ఈ రోజుల్లో అందరినీ ఫాదర్ అని అంటూ ఉంటారు. గాంధీని కూడా బాపూజీ అని అంటారు. కానీ అన్ని ధర్మాలవారు అలా అనరు. దాని అర్థాన్ని అర్థం చేసుకోరు. అందరి బాపూజీ శివబాబాయేనని మీకు తెలుసు. శివ దాదా కాదు, బాబా. వారు నిరాకార ప్రపంచములో ఉంటారు. శ్రీకృష్ణుడిని తలచుకుంటారు కానీ వారు వైకుంఠ నివాసి. ఋషులు, మునులు మొదలైన దేహధారులందరూ ఒకప్పుడు ఇక్కడ ఉండి వెళ్ళారు. పరమాత్మ నిరాకారుడు, వారికి దేహము లేదు. సర్వవ్యాపి జ్ఞానం కారణముగా ఎవరి బుద్ధీ పని చేయదు. తండ్రి వచ్చి బుద్ధి తాళాన్ని తెరుస్తారు. ఇది కొత్త విషయము. ఇతర సత్సంగాలలో శివబాబా జ్ఞానాన్ని ఇస్తున్నారు అని భావించరు. అక్కడ అందరూ దేహధారులే కూర్చొని ఉన్నారు. మేము నిరాకార తండ్రి నుండి వింటున్నాము అని మీకు నిశ్చయము ఉంది. నిరాకారుడు ఎప్పుడైతే సాకారములోకి వస్తారో, అప్పుడే పరిచయాన్ని ఇవ్వగలరు. తండ్రి కల్ప-కల్పమూ వస్తారు, వచ్చి యజమానులుగా తయారుచేస్తారు. అయినా మాయ ఎంతగా హైరానా పరుస్తుంది! విఘ్నాలు కలిగిస్తుంది. రుద్ర జ్ఞాన యజ్ఞములో అసురుల విఘ్నాలు కలుగుతాయి. దేహాభిమానము రావడం వల్లనే విఘ్నాలు కలుగుతాయి. బాబా అంటారు - స్వయాన్ని అశరీరిగా భావించండి. మనం బాబాకు చెందినవారిగా అయ్యాము. బాబా తిరిగి తీసుకువెళ్ళడానికి వచ్చారు. ఈ శరీరాన్ని వదిలి ఇప్పుడు తిరిగి వెళ్ళాలి. మీతో మీరు మాట్లాడుకోండి. సూక్ష్మ దేహధారులు మరియు స్థూల దేహధారులు, అందరి స్మృతినీ వదిలివేయాలి. పక్కా-పక్కా నిశ్చయాన్ని ఏర్పరచుకోవాలి. ఆత్మలైన మనం పరంధామం నుండి వచ్చాము. మనము అక్కడి నివాసులము. సత్యయుగములో ఇన్ని జన్మలు రాజ్యం చేసాము. 84 జన్మలు తీసుకున్నాము, ఇప్పుడు నాటకము పూర్తవుతుంది. తిరిగి వెళ్ళాలి. ఇంట్లో ఏదైనా గొడవ ఉంటే, ఒక చిన్న గదిలో శివుని చిత్రాన్ని పెట్టండి.

శివుని పూజ చేయకూడదు అని బ్రాహ్మణులు స్త్రీలకు చెప్తారు. కానీ శివబాబా అయితే మాతల కోసమే వస్తారు. చాలామంది వెళ్ళి శివునికి అభిషేకం చేస్తారు. పూజారులు సంతోషిస్తారు ఎందుకంటే అక్కడ మాతలు అందరికన్నా ఎక్కువ ధనం పెడతారు. భక్తితో కూడిన సత్యమైన భావన అబలలలో, మాతలలో ఉంటుంది. పురుషులు చంచలంగా ఉంటారు. ఘడియ-ఘడియా బయటికి వెళ్ళిపోతారు. బుద్ధియోగము ఎంతగానో భ్రమిస్తుంది. పత్నికి పతిపై ఎంతో మోహము ఉంటుంది. ఇది దుఃఖధామమని, ఇప్పుడు సుఖధామాన్ని స్థాపన చేసే బాబా వచ్చి ఉన్నారని పిల్లలైన మీకు తెలుసు. మేము తండ్రిని ఏ విధంగా స్మృతి చేయాలి - అని యుక్తులను రచించాలి. వారిని ఈ కనుల ద్వారా చూడలేరు. మా శివబాబా మాకు తండ్రి అని ఆత్మ అంటుంది. శివుని చిత్రాన్ని చూడడం ద్వారా ఎంతో సంతోషం కలుగుతుంది.

పిల్లలైన మీ యోగము కూడా అవ్యభిచారిగా ఉండాలి. శివుని చిత్రాన్ని పెట్టుకుని ఘడియ-ఘడియ స్మృతి చేస్తూ ఉండండి. బాబా తమ ఉదాహరణను తెలియజేసారు. లక్ష్మీ-నారాయణుల చిత్రముపై నాకు ఎంత ప్రేమ ఉండేది! తర్వాత ఒక రోజు ఆలోచన వచ్చింది - లక్ష్మి దాసిగా అయి కాళ్ళను ఒత్తుతున్నారు, ఇది కరక్ట్ కాదు. అప్పుడు ఆర్టిస్టుకు చెప్పాను - దీని నుండి లక్ష్మిని విముక్తము చేయండి. ఇకపోతే నారాయణుని చిత్రము జేబులో ఉండేది. ఒకటి జేబులో, ఇంకొకటి క్యాష్ బాక్స్ లో ఉండేది. ఘడియ-ఘడియ చిత్రాన్ని చూస్తూ ఉండేవారు, ఎంతో ఆనందించేవారు. కానీ గుప్తముగా ఎవరూ చూడకుండా చేసేవారు. లేదంటే - వీరేమి చేస్తున్నారు అని అంటారు. మొదట శ్రీకృష్ణునిపై ప్రేమ ఉండేది, ఆ తర్వాత వారిని వదిలి విష్ణువుతో ప్రేమ ఏర్పడింది. ఏ విధముగా నవ విధ భక్తి (అమితమైన భక్తి) ఉంటుందో, అదే విధముగా ఈ స్మృతి కూడా అమితముగా ఉండాలి, దీని ద్వారా లభించే ప్రాప్తి చాలా గొప్పగా ఉంటుంది. దాని ద్వారా ఏమీ లభించదు, అల్పకాలికముగా కాస్త సుఖము లభిస్తుంది, మళ్ళీ మరుసటి జన్మలో కష్టపడవలసి ఉంటుంది. భక్తిలో, వ్యాపార, వ్యవహారాలలో శ్రమించవలసి ఉంటుంది. సంపాదించండి, అప్పుడు తినండి. బాబా మీ చేత ఈ ఒక్క జన్మలో ఎంత కృషి చేయిస్తారంటే, ఇక 21 జన్మలు ప్రారబ్ధాన్ని అనుభవిస్తూ ఉంటారు. ఏ శ్రమ చేయవలసిన అవసరం ఉండదు. 21 జన్మలు సదా సుఖవంతులుగా ఉంటారు. కావున ఇటువంటి తండ్రి, ఎవరైతే పురుషార్థం చేయడం నేర్పిస్తారో, వారిని స్మృతి చేయాలి కదా. శ్వాస-శ్వాసలోనూ స్మృతి చేయండి అని అంటారు. గురువులు తమ

శిష్యులకు చెప్తారు - మాల తిప్పండి, రామ, రామ అని అంటూ ఉండండి, చాలు. రామ, రామ అని జపిస్తూ, జపిస్తూ రోమాలు నిక్కబొడుచుకుంటాయి. రామ-రామ అంటూ ఆనందంలో ఊగుతూ ఉంటారు. రాముని పురిలోకి చేరుకున్నట్లుగా భావిస్తారు. మీకైతే తండ్రి చెప్తారు - ఒక్క శివబాబా స్మృతిని అజపాజపముగా చేయండి (నిరంతర స్మృతి చేయండి), ఇంకేమీ గుర్తుకు రాకూడదు. కానీ మాయ కూడా ఎదుర్కొంటుంది. భక్తి మార్గంలో మాయ ఏమైనా ఎదుర్కొంటుందా. ఇది మాయ మరియు ఈశ్వరుని పిల్లల మధ్యన యుద్ధము. భగవంతుడు ఇలా అంటారు, మాయ ఇలా అంటుంది అని నాటకమును కూడా తయారుచేస్తారు. ఇప్పుడు ఇది సంగమయుగము. మాయ యొక్క తప్పుడు సంకల్ప-వికల్పాలు అయితే వస్తూ ఉంటాయి. కొన్ని తుఫానులు ఎంత తీవ్రంగా వస్తాయంటే, అవి మనుష్యులను కూడా పైకెత్తి దూరదూరాల వరకూ పడేస్తాయి. అలాగే ఇది మాయా రావణుని తుఫాను. వీటి నుండి సురక్షితంగా ఉండే యుక్తులను బాబా తెలియజేస్తూ ఉంటారు. మాకు పరమపిత పరమాత్మ రాజయోగాన్ని నేర్పిస్తారు అని మీరు అంటారు.

మిమ్మల్ని ఎవరైనా - మీ చేత ఈ సన్యాసాన్ని ఎవరు చేయించారు? గురువు ఎవరు? అని అడిగితే, పరమపిత పరమాత్మ అని చెప్పండి. ఈ విధంగా భగవంతుడే వచ్చి సన్యాసము చేయించేలా ఇంకెవ్వరూ ఉండరు. అక్కడంతా మనుష్యులు మనుష్యులతో చేయిస్తారు. ఇక్కడ తండ్రి వచ్చి అంటారు - దేహ సహితంగా ఏ సంబంధాలైతే ఉన్నాయో, వాటిని వదిలేయండి. ఈ పాత ప్రపంచాన్ని త్యజించి కొత్త ప్రపంచాన్ని స్మృతి చేయండి అని సన్యాసులు ఏమైనా అంటారా. ఇప్పుడు ప్రాక్టికల్ గా పాత ప్రపంచపు వినాశనము జరుగనున్నది, అందుకే అందరినీ బుద్ధి ద్వారా త్యజించి ఒక్క తండ్రితో బుద్ధిని జోడించాలి. మీరు నిశ్చితార్థము చేసుకుంటారు కదా. దేహధారులను స్మృతి చేస్తే ఆ నిశ్చితార్థము కచ్చాగా అయిపోతుంది. సర్వ ధర్మాలను పరిత్యజించాలి... నేను ఫలానాను, నేను ఇది... అవన్నీ వదిలి స్వయాన్ని ఆత్మగా భావించండి. మీరు 84 జన్మల గురించి తెలుసుకున్నారు. ఇప్పుడు సంతోషముగా తిరిగి వెళ్తారు. చప్పట్లు కొట్టాలి. ఆత్మలైన మనం ఒక శరీరాన్ని వదిలి మరొకటి తీసుకుంటాము. స్వయాన్ని దేహీగా భావించాలి. ఆత్మ అయిన మనం మొట్టమొదట తెల్లగా ఉండేవారము, తర్వాత 84 జన్మలు తీసుకున్నాము. ఇప్పుడు తిరిగి వెళ్ళి మళ్ళీ స్వర్గములోకి వచ్చి రాజ్యం చేస్తాము. ఈ స్వదర్శన చక్రాన్ని తిప్పడం ఎంత సహజము. శివుని చిత్రము మీ జేబులో ఉండాలి. బాబా, మీరు వచ్చారు, మీరు ఎంత మధురమైనవారు, మీరు మా బాబా కదా - ఈ విధముగా మాట్లాడుతూ ఉండాలి. శ్రీకృష్ణునితో భక్తి మార్గంలో ఇటువంటి మాటలు మాట్లాడేవారు కదా. శివుని ఫస్ట్ క్లాస్ లాకెట్ ను బంగారము, వెండితో తయారుచేస్తారు. పేదవారికి బంగారు లాకెట్ ను, షావుకారులకు వెండి లాకెట్ ను ఇస్తారు. ఈ మాతలు చాలా మధురమైనవారు. పల్లెటూరివారిలో భావన బాగుంటుంది. సాధారణమైన పిల్లలను చూసి బాబా కూడా సంతోషిస్తారు. శ్రీకృష్ణుడిని పల్లెటూరి బాలుడు అని అంటారు కదా. శ్రీకృష్ణుడు పల్లెటూరి బాలుడిగా అవ్వలేరు, వారు స్వర్గానికి అధిపతి. వీరి (బ్రహ్మ) విషయాలను మరియు శ్రీకృష్ణుని విషయాలను కలిపేసారు. పల్లెటూరి అనుభవమంతా వీరికి ఉంది. కావున శివబాబా లేక శ్రీకృష్ణుడు పల్లెటూరి బాలుడిగా అవ్వలేరు. ఈ దాదా బాల్యములో అలా ఉండేవారు. పల్లెటూరిలోనే పెరిగాను. ఈ సాధారణ తనువులోకి తర్వాత బాబా వచ్చి ప్రవేశించారు. బాబా ముఖ్యమైన విషయాన్ని అర్థం చేయించారు - మొత్తం ఆధారమంతా స్మృతి పైనే ఉంది. స్మృతిని ఎప్పుడూ మర్చిపోకూడదు. నేను తండ్రిని మర్చిపోతున్నాను అని లౌకిక బిడ్డ ఎప్పుడైనా అంటారా. ప్రేయసి ఎప్పుడైనా ప్రియుడిని మర్చిపోతారా? అది అసంభవము. ఇది పిల్లలైన మీరు చేయవలసిన శ్రమ. నిరంతరం స్మృతి చేసే అభ్యాసము ద్వారానే వికర్మలు వినాశనమవుతాయి. లేదంటే మళ్ళీ శిక్షలను అనుభవించవలసి వస్తుంది. విజయమాలలోకి రాలేకపోతారు. తండ్రి అద్భుతము ఏమిటంటే - వారు వృద్ధ మాతలను, పేదవారిని, వేశ్యలను, అహల్యలను, నడుము వంగిపోయిన వారు మొదలైనవారిని తమవారిగా చేసుకుంటారు. నిజానికి ఏ చిత్రమూ అవసరము లేదు. కానీ మాయ మరిపింపజేస్తుంది, అందుకే చిత్రము పెట్టుకోవడం జరుగుతుంది. మేము బాబా వద్దకు వెళ్తాము అని బుద్ధిలో ఉండాలి. ముక్తి-జీవన్ముక్తుల మార్గాన్ని చూసాము. మార్గదర్శకులు ఇంకెవ్వరూ ఉండరు. దీనిని ఇంద్రప్రస్థము అని కూడా అంటారు, పతితులు ఎవరైనా వచ్చి దాక్కొని కూర్చుంటే రాతిబుద్ధి కలవారిగా అయిపోతారు. బాబా అయితే అంతర్యామి కదా! ఈ బాబా (బ్రహ్మ) బాహర్యామి. ఆ బాబాకు - పతితులు దాగి కూర్చున్నారు అని వెంటనే తెలిసిపోతుంది. కావున ఎవరైతే ఈ విధముగా పతితులను తీసుకువచ్చారో మరియు పతితులు ఎవరైతే వచ్చి కూర్చున్నారో, వారిరువురికీ శిక్షలు పడతాయి, అందుకే ఎప్పుడూ పతితులను తీసుకురాకూడదు. లా (నియమము) ఇలా కఠినముగా ఉంది. అశుద్ధమైన పతితులెవ్వరినీ కూర్చోబెట్టకూడదు. లేదంటే చాలా కఠినమైన శిక్షలకు పాత్రులుగా అవుతారు. ఇక్కడ దొంగతనము, మోసము ఏదీ నడవదు. పాపము మరియు పుణ్యము యొక్క లెక్క ధర్మరాజు వద్ద ఉంటుంది కదా.

అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. అందరి స్మృతిని సమాప్తం చేసి, బుద్ధియోగాన్ని అందరి నుండి తెంచి ఒక్క తండ్రి స్మృతిలో ఉండాలి. శివబాబా యొక్క చిన్న గదిని తయారుచేసి వారి అవ్యభిచారీ స్మృతిలో కూర్చోవాలి.

2. తమతో తాము మధురాతి-మధురమైన మాటలను మాట్లాడుకోవాలి. మేము మొదట ఎంత సుందరముగా (తెల్లగా) ఉండేవారము, తర్వాత 84 జన్మలను తీసుకొని ఇప్పుడు సంతోషముగా తిరిగి వెళ్తాము... ఈ విధముగా తమతో తాము మాట్లాడుకొని స్వదర్శన చక్రాన్ని తిప్పాలి.

వరదానము:- స్వచింతన మరియు స్వదర్శన ద్వారా వజ్రసమానమైన అమూల్య జీవితాన్ని అనుభవం చేసే మచ్చలేనివారిగా కండి

వజ్రసమానమైన అమూల్య జీవితాన్ని అనుభవం చేసేందుకు సదా స్వచింతన చేయండి మరియు స్వదర్శన చక్రధారులుగా అవ్వండి ఎందుకంటే వజ్రాన్ని మచ్చతో కూడుకున్నదిగా చేసేది కేవలం రెండు విషయాలే - ఒకటి పరదర్శన, రెండవది పరచింతన. ఈ రెండు విషయాలే సాంగత్యపు రంగులో స్వచ్ఛమైన వజ్రాన్ని మచ్చతో కూడుకున్నదిగా చేస్తాయి, అందుకే ఈ మూల బీజాన్ని సమాప్తం చేసి స్వచింతన చేయండి మరియు స్వదర్శన చక్రాన్ని తిప్పండి, అప్పుడు ధూళి మరియు మచ్చలు అంటుకోవు. సదా మచ్చ లేని, సత్యమైన వజ్రముగా, మెరుస్తున్న అమూల్యమైన వజ్రముగా అవుతారు.

స్లోగన్:- విచిత్రుడైన తండ్రి యొక్క చిత్రాన్ని మరియు చరిత్రను స్మృతి చేసేవారే చరిత్రవంతులు.